

ఆటల అభివృద్ధికి బాటలు

రాష్ట్రంలో క్రీడలు, యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి శాఖలను వేరు చేస్తూ జీఓ విడుదల అయింది. ఇకపై డీఎస్‌ఏ పాలనా పరమైన వ్యవహారాలను డీఎస్‌ఏ అధికారులే పర్యవేక్షిస్తారు.

8లో



ఘనంగా సత్యదీక్షల విరమణ

రత్నగిరి వాసుడు సత్యదేవుని నామం జపిస్తూ దీక్షలు ఆచరించిన వేలాది మంది స్వామివారి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా సోమవారం దీక్ష విరమించారు.

నీటి విడుదల తగ్గింపు



ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం డెల్టా కాలువలకు నీటి విడుదలను తగ్గించారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు పూర్తిగా నీటి విడుదలను నిలిపివేశారు.

న్యూస్‌రీల్

జిల్లాలో భారీ వర్షాలు

అమలాపురం రూరల్: తుపాను ప్రభావంతో కోనసీమలో రెండురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు 1,380.0 మిల్లీమీటర్లు నమోదు అయింది. సగటు వర్షపాతం 62.2.మిల్లీమీటర్లు నమోదు అయ్యింది. కాట్రేనికోన మండలంలో అత్యధికంగా 122.8 మి.మీటర్లు వర్షం నమోదు అయ్యింది. అత్యల్పంగా మండపేట మండలంలో 18.4 మి.మీటర్లు రికార్డు అయింది.

మండలాల వారీగా వర్షపాతం

అల్లవరం మండలంలో 57.4 మి.మీటర్లు, అమలాపురం 86.6, ఐ.పోలవరం 81.4, మలికిపురం 63.4, మామిడికుదురు 70.6, ముమ్మిడివరం 87.0, రాజోలు 52.6, సఖినేటిపల్లి 58.4, ఉప్పలగుప్తం 67.6, కపిలేశ్వరపురం 55.4, కె.గంగవరం 49.0, రామచంద్రపురం 49.4, రాయవరం 39.6, అయినవిల్లి 103.6, అంబాజీపేట 95.4, పి.గన్నవరం 53.4, ఆలమూరు 41.2, ఆత్రేయపురం 32.2, కొత్తపేట 62.0, రావులపాలెం 56.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. జిల్లాలో ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి సోమవారం ఉదయం ఎనిమిది గంటల వరకు సగటున 35.6 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యధికంగా మామిడికుదురు మండలంలో 70.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

సానుకూలంగా స్పందించాలి



స్పందనలో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ శుక్లా

అమలాపురం రూరల్: ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి జగనన్నకి చెబుదాం స్పందన కార్యక్రమాలకు వచ్చే అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సంతృప్తికర స్థాయిలో అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీదారుల నుంచి 41 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా విచారించి అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో తగు పరిష్కార మార్గాలు చూపాలని ఆదేశించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా ఒకసారి సమర్పించిన అర్జీ మళ్లీ అదే అంశంపై పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి అర్జీపై సకాలంలో పరిష్కార మార్గాలు చూపుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణ తీరుపై అర్జీదారులలో విశ్వసనీయతను పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ 'జగనన్నకు చెబుదాం'కు నాలుగు అర్జీలు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మిచాంగ్ తుపాను ప్రభావం పడింది. కేవలం నలుగురు మాత్రమే వచ్చి అర్జీలు అందజేశారు. జిల్లా ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ కార్యాలయ స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్ కూడా పాల్గొన్నారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్త చర్యల్లో పోలీసు సిబ్బంది నిమగ్నమైంది. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొబ్బరికి గిట్టుబాటు ధర

కొత్తపేట: నాఫెడ్–ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్టు ఏపీ ఆయిల్‌ఫెడ్ కోఆర్డినేటర్ ఉప్పాడ సుధాకరరావు తెలిపారు. కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద సోమవారం నాఫెడ్ – ఆయిల్ ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొబ్బరి ధర తగ్గి రైతుల ఆదాయం పడిపోయిందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసిందన్నారు. వెంటనే స్పందించిన కేంద్రం గత నెల ఒకటో తేదీ నుంచి కొబ్బరి కొనుగోలుకు చర్యలు తీసుకుందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రధాని అధ్యక్షతన ఏటా జనవరిలో ధరల నిర్ణయం జరుగుతుందన్నారు. ఏడాది పాటు ఆ ధరలు అమలులో ఉంటాయన్నారు. ఈ ఏడాది అక్టోబర్ వరకూ బయట మార్కెట్‌లో మిల్లింగు కొబ్బరి క్వింటాలు రూ.6 వేలు, బాల్ కొబ్బరి క్వింటాలు రూ.8 వేలు ఉండగా నాఫెడ్ – ఆయిల్‌ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాల ద్వారా కేంద్రం నిర్ణయించిన ప్రకారం మిల్లింగు కొబ్బరి రూ.10,860కి, బాల్ కొబ్బరి రూ. 11,750కు కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రైవేట్ వ్యాపారస్తులు ఈ ధరలకే కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కేంద్రం ద్వారా కొబ్బరి విక్రయించాలనుకునే రైతులు ఆర్‌బీకే ద్వారా ఈ క్రాప్ నమోదుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వారం వ్యవధిలో రైతు ఖాతాకు నగదు జమ అవుతుందన్నారు.

నష్ట నివారణపై దృష్టి

- తుపాను వేళ సర్కారు ప్రత్యేక చర్యలు
- కాట్రేనికోనలో అత్యధికంగా 12.26 సెంటీమీటర్లు
- తీరంలోని నీట మునిగిన వరి చేలు
- ఆందోళనలో అన్నదాతలు
- మత్స్యకారులు ఇళ్లకే పరిమితం
- రెండు రోజులలో ఆఫ్‌లైన్‌లో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- సహాయ పునరావాస చర్యలకు రూ.రెండు కోట్లు మంజూరు



కె.గంగవరంలో ధాన్యం తడవకుండా బరకాలు కప్పుతున్న రైతులు

సాక్షి అమలాపురం: మిచాంగ్ తుపాను జిల్లాపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. సోమవారం భారీ వర్షాలు జిల్లాను అతలాకుతలం చేశాయి. తుపానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. సామాన్యుల రక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు, పునరావాసంపై దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో తుపాను పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అడపాదడపా కుంభవృష్టిని తలపించేలా వర్షం కురిసింది. వర్షాలకు ఈదురుగాలులు తోడయ్యాయి. తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. వర్షాలు ఖరీఫ్ రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వందల ఎకరాల్లో చేలు నేలనంటాయి. ముంపుబారిన పడ్డాయి.

మిచాంగ్ తుపాను వల్ల జిల్లాలో ఆదివారం రాత్రి మొదలైన వర్షం సోమవారం తెల్లవారు జాము నుంచి తీవ్ర రూపం దాల్చింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు సగటున 35.6 మి.మీటర్ల వర్షం కురవగా, ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు సగటున 62.7 మి.మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా కాట్రేనికోన మండలంలో 122.6 మి.మీటర్లు, అత్యల్పంగా మండపేటలో 18.4 మి.మీటర్ల వర్షం కురిసింది. వర్షాలకు అమలాపురం పట్టణంతో పాటు రామచంద్రపురం, మండపేట తడిసి ముద్దయ్యాయి. తీరప్రాంత మండలాల్లో తుపాను తీవ్రత అధికంగా ఉంది. వర్షాలకు పలు లోతట్టు కాలనీలు ముంపుబారిన పడ్డాయి. సామాన్యులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వేట నిలిపివేయడంతో జిల్లాలోని ఓడలరేవు, కరవాక, అంతర్వేది పల్లిపాలెం, భైరవపాలెం, పల్లం, కొత్తపాలెం, బలుసుతిప్ప, చిర్రయానాం, ఎస్.యానాం, వాసాలతిప్పలకు చెందిన వందలాది మంది మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు.

తుపాను నేపథ్యంలో సోమవారం పాఠశాలలకు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం మధ్యాహ్నం వరకు తుపాను ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలకు మంగళవారం కూడా సెలవిచ్చారు. గాలుల తీవ్రతకు ఉప్పలగుప్తం మండలం గోపవరంలో భారీ వృక్షం నేలకొరిగింది.



అంబాజీపేట మండలం ఇసుకపూడిలో నేలకొరిగిన వరి చేలు



అంతర్వేది బీచ్‌లో ఎగిసి పడుతున్న కెరటాలు

నీట మునిగిన వరి చేలు

భారీ వర్షాలు అన్నదాత ఆశలపై నీళ్లు జల్లాయి. జిల్లాలో 3,800 ఎకరాల పంట నేలకొరిందని ప్రాథమిక అంచనా. మరో వెయ్యి ఎకరాల పంట నీట మునిగింది. 40 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం రైతుల వద్ద ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, ఇంకా 56 వేల ఎకరాల వరకు కోత కోయాల్సి ఉంది. తుపాను ప్రభావం వల్ల మంగళవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున వరిపై మరింత ముంపు ప్రభావం ఉంటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోతలు పూర్తవడంతో మండపేట, రామచంద్రపురం, కొత్తపేట ప్రాంతాల్లో పెద్దగా ముంపులేదు. అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్లలో ముంపు అధికంగా ఉంది.

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ : 088562 93104
టోల్ ఫ్రీ : 1800 425 2532
ఏపీఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్‌లు
అమలాపురం డివిజన్ : 94408 12659
రామచంద్రపురం డివిజన్ : 94931 78821, 08857 243082

పునరావాసంపై ప్రత్యేక దృష్టి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బాధితులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్‌లు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు అందించాల్సిన సహాయ పునరావాసంపై సూచనలు చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరకుండా చూడాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుపై సీఎం జగన్ చర్చించారు.

- జిల్లాలో తీర ప్రాంత గ్రామాలలో 37 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడకు బాధితులను తరలించే చర్యలు చేపట్టారు. ఈ కేంద్రాల వద్ద తాగునీరు అందుబాటులో ఉంచారు. వచ్చిన బాధితులకు ఆహారం అందిస్తున్నారు.
- పునరావాస కేంద్రాలకు వచ్చిన ముంపు బాధిత కుటుంబాలలోని ఒక్కొక్క కుటుంబానికి రూ.2,500, ఒక్కొక్క వ్యక్తికి రూ.వెయ్యి చొప్పున అందించనున్నారు. పునరావాస కేంద్రాన్ని విడిచి ఇంటికి వెళ్లే సందర్భంలో డబ్బు ఇస్తారు.
- ఇళ్లలోకి ముంపు నీరు చేరిన బాధితులు, ఇంటి నుండి బయటకురాని పరిస్థితులు నెలకొన్న బాధితులకు ఉచితంగా 25 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, కిలో బంగాళా దుంపలు, లీటర్ పామాయిల్ పంపిణీ చేయాలని ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గిన 48 గంటల్లోపు అందించనున్నారు. ఇళ్లు, గుడిసెలు దెబ్బతిన్న ముంపు బాధిత కుటుంబాలకు ఒక్కొక్క గృహానికి రూ.10 వేలు చొప్పున అందించనున్నారు.
- ముంపు బాధితుల తరలింపునకు పడవలను, రోడ్ క్లియరెన్స్‌ల కోసం మండలానికి రెండు బృందాల చొప్పున ఏర్పాటు చేశారు. ఈ బృందంలో పోలీసులు, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులతోపాటు జేసీబీ, పవర్ రంపాలు ఉంటాయి.
- 15 రోజులు లోపు పురుడుపోసుకునే గర్భిణులను గుర్తించి స్థానిక పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తరలించారు.

తుపాను ప్రభావిత మండలాలు :	9
తుపాను ప్రభావిత గ్రామాలు :	41
ప్రభావిత ప్రాంతాల ప్రజలు :	3,69,663
ఏర్పాటు చేయాల్సిన పునరావాస కేంద్రాలు :	41
ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు :	37
పునరావాస కేంద్రాలకు తరలించిన కుటుంబాలు :	400
పునరావాస కేంద్రాలకు తరలించిన ప్రజలు :	910
భోజన వసతి కల్పించింది 910మందికి అందించిన మంచినీరు 5 వేల లీటర్లు	

అప్రమత్తంగా ఉండండి

తుపాను విపత్తును ఎదుర్కొనే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తీర ప్రాంత మండలాలకు చెందిన అధికారులు కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి సహాయక పునరావాస చర్యలు చేపట్టాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి వివిధ మండలాల తహసీల్దార్లతో తుపాను అప్రమత్తత, సన్నద్ధత చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయని మంగళవారం మధ్యాహ్నానికి తుపాను తీరం దాటే అవకాశముందన్నారు. ధాన్యం సేకరణ ఎలా జరుగుతున్నదీ అడిగి తెలుసుకున్న ఆయన పలు సూచనలు చేశారు. సహాయ పునరావాస కేంద్రాలలో అందుబాటులో ఉంచిన సౌకర్యాల గురించి ఆరా తీశారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు పాల్గొన్నారు.

రెండు రోజులు... 40 వేల మెట్రిక్ టన్నులు

- ధాన్యం అమ్మకాల్లో రైతులకు అక్కరకు వచ్చిన ఆఫ్‌లైన్ విధానం
- తుపాను హెచ్చరిక నేపథ్యంలో వేగంగా స్పందించిన జిల్లా యంత్రాంగం

సాక్షి అమలాపురం: తరుముకొస్తున్న తుపాను ఒకవైపు... కళ్లాల్లో పేరుకుపోయిన ధాన్యం మరోవైపు. అన్నదాత ఆందోళనలో కూరుకుపోయిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదారంగా స్పందించింది. కళ్లాల్లోని ధాన్యాన్ని తరలించేందుకు ఆఫ్‌లైన్ విధాన్ని తీసుకువచ్చింది. ఈ నిర్ణయం ఖరీఫ్ రైతులకు ఊరటనిచ్చింది. ధాన్యం తుపాను బారిన పడకుండా జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు ఆగమేఘాలపై తరలించింది. జిల్లాలో శని, ఆదివారాలలో రికార్డు స్థాయిలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించింది. కేవలం రెండు రోజులలో రైతుల వద్ద ధాన్యాన్ని ప్రభుత్వం వేగంగా సేకరించగలిగింది. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, ఆత్రేయపురం, అయినవిల్లి, పి.గన్నవరం, రావులపాలెం, కొత్తపేట మండలాల్లో ఈ విధానంలో కొనుగోలు ఎక్కువగా జరిగింది. ఈ ఏడాది ఖరీఫ్ సాగులో రికార్డు స్థాయి దిగుబడి వచ్చింది. జిల్లాలో 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, 3.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోందని అధికారులు అంచనా వేశారు. కాని ఎకరాకు 35 బస్తాలు (బస్తా 75 కేజీలు) నుంచి 48 బస్తాల వరకు దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఈ విధంగా చూస్తే ఖరీఫ్ దిగుబడి 4.60 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటుందని అంచనా.



రాయవరం మండలం వెంటూరులో రాత్రి వేళల్లో ధాన్యం కొనుగోలు

ఈ ఏడాది ధాన్యాన్ని ప్రభుత్వం 331 ఆర్‌బీకేల ద్వారా సేకరిస్తోంది. ఇంత వరకు 88,047 ఎకరాలకు సంబంధించి మాసూళ్లు పూర్తికాగా, 1,43,435 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. దీనిలో ఆన్‌లైన్ విధానంలో 96,965 మెట్రిక్ టన్నులు, ఆఫ్‌లైన్ విధానంలో 48,470 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇక ప్రైవేట్‌గా కొనుగోలు చేసిన ధాన్యం 30 వేల మెట్రిక్ టన్నులు. జిల్లాకు చెందిన రెవెన్యూ, వ్యవసాయశాఖ, సివిల్ సప్లయిస్ అధికారులతోపాటు ఆర్‌బీకే సిబ్బంది కొనుగోలును పర్యవేక్షిస్తున్నారు.

రైతులకు మేలు చేసే విధంగా...

రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం ఆఫ్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చింది. దీని ద్వారా ఇప్పటి వరకు 48,470 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాం. దీంతో రెండు రోజులలో 40 వేల మెట్రిక్ టన్నులు సేకరించగలిగాం.

– సుధాసాగర్, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి

అధైర్య పడొద్దు... అండగా ఉంటాం



కుందూరులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు

రైతులకు మంత్రి వేణు భరోసా

కె.గంగవరం/రామచంద్రపురం రూరల్: తుపాను వర్షాలకు రైతులెవ్వరూ అధైర్యపడొద్దని ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని కుందూరులోనూ, రామచంద్రపురం మండలంలోని వెలంపాలెం, నెలపర్తిపాడు, గణపతినగరం గ్రామాల్లో మంత్రి వేణు రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులతో కలసి సోమవారం పర్యటించారు. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు, తడిసిన ధాన్యాన్ని గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకునే విషయంలో ఇప్పటికే తగిన సూచనలు చేశారన్నారు. దానికనుగుణంగా ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, పొలం గట్లపై ఆరబెట్టిన ధాన్యం తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ఈ ప్రభుత్వం రైతు పక్షపాతి అన్నారు. రైతులు కూడా నష్టపోకుండా తమ దగ్గర ఉన్న ధాన్యాన్ని వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రామచంద్రపురం ఆర్డీఓ సుధాసాగర్, ఎంపీపీ పంపన నాగమణి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆయన వెంట ఉన్నారు.

యువత క్రీడలలో రాణించాలి



ఆడుదాం- ఆంధ్రా కిట్లను ప్రదర్శిస్తున్న కలెక్టర్ శుక్లా, జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: ఆడుదాం ఆంధ్ర పోటీలలో యువత ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటుకుంటూ జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా యువతకు పిలుపునిచ్చారు. ఆడుదాం–ఆంధ్ర రాష్ట్ర వ్యాప్త క్రీడాపోటీల నిర్వహణ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆడుదాం –ఆంధ్ర నోడల్ అధికారి ఎస్.నుపూర్ అజయ్ కలెక్టరేట్‌లో ఆడుదాం- ఆంధ్రకు సంబంధించిన క్రీడా పరికరాలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రదర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ క్రీడలు శారీరక దారుఢ్యానికి, క్రీడా ప్రతిభను చాటుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలు ఐదు స్థాయిలలో గ్రామ, వార్డు, సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు జరుగుతాయన్నారు. 15 నుంచి 60 సంవత్సరాల లోపు ఉన్న స్త్రీ, పురుషులందరూ వారి గ్రామ వలంటీర్ల ద్వారా డిసెంబర్ 14వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవలసిందిగా కోరారు. 15వ తేదీ నుంచి జిల్లాలో అన్ని సచివాలయ స్థాయిలో క్రీడాపోటీలు ప్రారంభిస్తామని తెలియజేశారు. గ్రామ సచివాలయ పరిధిలో నివసిస్తున్న, చదువుతున్న, తాత్కాలిక నివాసి అర్హుడని, ఆడుదాం–ఆంధ్రాలో పాల్గొనడానికి ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అర్హులు కాదన్నారు. ఒక క్రీడాకారుడు గరిష్ఠంగా రెండు క్రీడలలో పాల్గొనవచ్చునని చెప్పారు. నాకౌట్ పద్ధతిలో పురుషులకు, స్త్రీలకు వేరు వేరుగా పోటీలు నిర్వహిస్తారన్నారు. ఏపీ.జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో క్రీడా జట్లు నమోదు చేసుకోవాలన్నారు. సాధ్యమైనంత ఎక్కువ జట్లను జిల్లాలో గ్రామ వార్డు సచివాలయ స్థాయిలలో నమోదు చేయవలసినదిగా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. గ్రామ వార్డు సచివాలయ స్థాయిలో ఉపయోగించే బేసిక్ క్రీడా పరికరాల కిట్‌లను, మండల స్థాయిలో గెలిచి బహుమతిగా పొందే ప్రొఫెషనల్ కిట్‌లను ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ క్రీడా కిట్‌లు ఇప్పటికే సచివాలయాలకు చేరుకున్నాయన్నారు. సోమవారం నుండి ప్రారంభిస్తున్న వలంటీర్ల డోర్ టు డోర్ ఆడుదాం–ఆంధ్రాకు సంబంధించిన బ్రోచర్లను ఆయన ఈ సందర్భంగా ఆవిష్కరించారు. జిల్లా సచిలవాయాల నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి కమల కుమారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈవో రాజు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కాకినాడ వికాస, జేకేసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ సోమవారం తెలిపారు. పదవ తరగతి పాస్, ఇంటర్ నుంచి డిగ్రీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, అగ్రికల్చరల్, ఎంకాం, ఎంబీఏ విద్యార్హతలు ఉన్న 30 ఏళ్ల లోపువారు అర్హులు. ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు తీసుకుని హాజరుకావాలన్నారు.

రైతులూ.. పంటను కాపాడుకోండిలా..

- మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్
- వర్షాలు తగ్గేవరకు వరి పంటను కోయవద్దు
- తుపాను నేపథ్యంలో సూచనలు

అల్లవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో తీర ప్రాంతంలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని, పండిన పంటను కాపాడుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలని మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త టి.శ్రీనివాస్ సోమవారం ప్రకటనలో తెలిపారు. తుపాను నేపథ్యంలో పండిన వరి పంటను కోయరాదన్నారు. వరి కోతలు కోసి పూర్తిగా ఆరని వరి పనలను కుప్పలుగా వేసేటప్పుడు ఎకరానికి 25 కేజీల ఉప్పును పనలపై వేయాలని సూచించారు. కోత కోసిన పొలంలో వరి పనలు వర్షానికి తడిస్తే 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై స్ప్రే చేయాలి. ఒకవేళ నీరు పొలాల్లో నిలిచిపోతే వరి పనలను గట్టుకి చేర్చి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. ఈ విధంగా చేస్తే మొలక రాదు. కళ్లాల్లో ఉన్న ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలి. నూర్చిన ధాన్యం రెండు, లేదా మూడు రోజుల పాటు ఎండబెట్టడానికి వీలులేక పోతే గింజలు మొలకెత్తే అవకాశం ఉంది. ఇటువంటి సమయాల్లో క్వింటాల్ ధాన్యానికి 20 కేజీల ఉప్పుని పొడి ఊకతో కలిసి పోగుచేస్తే నష్టం తగ్గుతుంది. ధాన్యం పాడవకుండా ఉంటుంది. గింజలు గట్టిపడే దశలో వెన్ను బరువుతో వరి దుబ్బులు కొద్దిపాటి గాలికి, వర్షానికి పడిపోయే ప్రమాదం ఉంది. ఈ విధంగా పడిపోతే గింజలు గట్టిపడక తాలు గింజలుగా మారే అవకాశం ఉంది. ఈ సమయాల్లో పడిపోయిన వరి దుబ్బులను నిలబెట్టి కట్టలుగా కట్టాలి.

నారుమడి సంరక్షణ ఇలా..

దాళ్వా నారుమడిలో విత్తనం చల్లాక 2–3 రోజులపాటు నీటిలో ఉంటే మొలకశాతం గణనీయంగా తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని బయటకు మళ్లించాలి. నారుమడి 7 నుంచి 30 రోజుల మధ్యలో 5 రోజుల పాటు నీటిలో మునిగితే నారు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సమయాల్లో రైతులు నారుమడిలో నీరు లేకుండా చూసుకోవాలి. 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ చల్లితే కొత్త నారు వస్తుంది. అధిక వర్షాలకు నారు తెగుళ్లు బారిన పడకుండా ఉండాలంటే నీటిని పూర్తిగా తీసివేసి లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల మాంకోజెబ్ కలిసిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలి.

వరి నాట్లు పిలక దశలో ముంపునకు గురైతే నీటిని పూర్తిగా తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువు అందించవలసి ఉంది. ఈ విధంగా బూస్టర్ డోసు వేయడం వల్ల ముంపు ప్రభావం నుంచి వరి త్వరగా కోలుకుంటుంది. తర్వాత తెగుళ్లు రాకుండా లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండిజం మందును పిచికారీ చేయాలి.

పెళ్లి పీటలు ఎక్కవలసిన వలంటీర్ గుండెపోటుతో మృతి


మృతుడు రాజు

జగ్గంపేట: కొద్ది రోజులలో పెళ్లి పీటలు ఎక్కవలసిన గ్రామ వలంటీర్ పెళ్లి కొడుకుగా చేసే రోజునే గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని మామిడాడ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేగి ఏసురాజు (24)కు ఈ నెల 7వ తేదీన వివాహం జరగాల్సి ఉంది. సోమవారం ఉదయం పెళ్లి కొడుకును చేసే కార్యక్రమం మరో రెండు గంటలలో మొదలు కావాల్సిన సమయంలో రాజుకు ఛాతిలో నొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపీ దగ్గరకు వెళ్లి ప్రాథమిక చికిత్స చేయించుకున్నాడు. మరి కొద్దిసేపటికే అతను మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని గ్రామ వీఆర్ఓ శేషగిరిరావు చెప్పారు. గంగవరం గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం జరగనుండగా అతని మృతి రెండు కుటుంబాలలో విషాదం నింపింది. ఆదివారం బంధువుల ఇళ్లకు వెళ్లి పెళ్లికార్డులు పంపిణీ చేయడంతో పాటు, పెళ్లి ఏర్పాట్లు చకచకా చేసిన రాజు మృతి చెందడం స్థానికులను, మిత్రులను కలచి వేసింది.

ఆటల అభివృద్ధికి బాటలు

- క్రీడలు, యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి శాఖలను వేరు చేస్తూ జీఓ
- బ్యాంక్ లావాదేవీల నిర్వహణ డీఎస్ఏకు
- డీఎస్డీఓ పోస్టు పునరుద్ధరణ
- ఇక సులువుగా పరిపాలన

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ) : రాష్ట్రంలో క్రీడలు, యువజన సర్వీసులు, శిక్షణ, ఉపాధి శాఖలను వేరు చేస్తూ జీఓను విడుదల అయింది. 2018 ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలులోఉన్న విధానాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ), యూత్ సర్వీసెస్, ట్రెనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్ (స్టెప్)ను వేరు చేయడంపై క్రీడాసంఘాలు, డీఎస్ఏ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాస్థాయిలో క్రీడలు, యువజన సంక్షేమం, స్టెప్ బాధ్యతలను స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించేవారు. ఇకపై డీఎస్ఏ పాలనా పరమైన వ్యవహారాలను డీఎస్ఏ అధికారులే పర్యవేక్షిస్తారు.

విలీన ఇబ్బందులకు ఇక తెర పడినట్టే..

విలీనంతో ఏర్పడిన పాలనాపరమైన ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం తెర వేసినట్లయింది. 2018లో ఉన్న ప్రభుత్వం క్రీడల శాఖను యువజన సర్వీసుల శాఖలో విలీనం చేయడం వల్ల పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తి రాష్ట్రంలో క్రీడాభివృద్ధి అనుకున్న స్థాయిలో జరగలేదు. కాకినాడ డీఎస్ఏ ఆధ్వర్యంలో కాకినాడ, సామర్లకోట, తుని ప్రాంతాల్లో స్టేడియాలు వినియోగంలో ఉన్నాయి. వీటి అన్నింటిని ఇప్పటి వరకు స్టెప్ అధికారులు పర్యవేక్షించేవారు. గతంలో క్రీడాప్రాధికార సంస్థకు సంబంధించిన ఫైల్స్ డీఎస్డీఓ ద్వారా జేసీ–2, ఆయన ద్వారా కలెక్టర్‌కు నివేదించేవారు. 2018 తరువాత నుంచి స్టెప్ సీఈఓకు బాధ్యతలు ఇవ్వడంతో స్టెప్ సూపరింటెండెంట్ నుంచి మేనేజర్, మేనేజర్ నుంచి స్టెప్ సీఈఓకు ఆయన ద్వారా జేసీ–2, అక్కడి నుంచి కలెక్టర్‌కు నివేదించాల్సిన పరిస్థితి నెలకొంది. స్టెప్ సీఈవోలకు మాతృశాఖతోపాటు డీఎస్ఏ బాధ్యతలు అప్పగించడంతో వారికి ఉన్న పని ఒత్తిడిలో డీఎస్ఏ పై అంతగా దృష్టి సారించేవారు కాదు. దీంతో ఫైల్స్ త్వరగా కదలక డీఎస్ఏ వర్గాలు ఇబ్బందులు పడేవి. ఇప్పుడు నేరుగా డీఎస్డీఓల నుంచి కలెక్టర్‌కు నివేదించవచ్చు. జిల్లాలో స్టెప్ శాఖతో పోలిస్తే డీఎస్ఏ పెద్దది. ఇప్పటి వరకు చిన్న శాఖలో పెద్దశాఖను విలీనం చేసి పరిపాలన సాగించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో క్రీడల శాఖకు విలీనం వల్ల కలిగిన ఇబ్బందులు తొలగినట్లయింది. ఈ శాఖకు తగిన న్యాయం జరిగిందని క్రీడాసంఘాల ప్రతినిధులు ప్రభుత్వంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో క్రీడాభివృద్ధి తిరిగి పూర్వ వైభవం సంతరించుకుంటుందని, ఇది క్రీడాకారులకు ఎంతో మేలంటున్నారు.

బ్యాంక్‌లావాదేవీల బాధ్యతలు డీఎస్డీఓలకే

డీఎస్ఏల బ్యాంక్ లావాదేవీలను డీఎస్డీఓలకే అప్పగిస్తూ జీవోలో పేర్కొన్నారు. దీంతో క్రీడాసంఘాలకు సంబంధించిన నగదు పనులు త్వరిత గతిని పూర్తయ్యేవీలు కలిగింది.



కాకినాడ డీఎస్ఏ ముఖద్వారం

డీఎస్డీవో పోస్టు పునరుద్ధరణ

సుమారు 25 సంవత్సరాల పాటు కొనసాగిన డీఎస్డీఓ (జిల్లా క్రీడాభివృద్ధి అధికారి) పోస్టును 2018లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. 1994 నుంచి రాష్ట్రంలో డీఎస్డీఓ వ్యవస్థ ప్రారంభమైంది. అంతకుముందు జిల్లా స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శులు క్రీడలు, శిక్షణను పర్యవేక్షించేవారు. అప్పట్లో ఒక్కో జిల్లాలో ఒక్కో విభాగం అధికారిని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. కాలక్రమంలో డీఎస్ఏ కార్యదర్శి పోస్టును ప్రభుత్వం రద్దు చేసి డీఎస్డీఓలకే అన్ని బాధ్యతలు అప్పగించింది. అయితే 2018లో ప్రభుత్వం పై ఉన్న భారం తగ్గించడం కోసం ఎన్నో ఏళ్లుగా ఉన్న డీఎస్డీఓ పోస్టును అప్పటి ప్రభుత్వం రద్దు చేసి, డీఎస్డీఓలను చీఫ్‌కోచ్‌లుగా మార్చింది. ఈ నెల 27న జగన్‌మోహన్ రెడ్డిప్ర ప్రభుత్వం డీఎస్డీఓ పోస్టును పునరుద్ధరిస్తున్నట్టు జీవో విడుదల చేయడంతో రాష్ట్రంలోని చీఫ్‌కోచ్‌లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్డీఓ పోస్టుల పునరుద్ధరణ అభినందనీయం



రాష్ట్రంలో చీఫ్ కోచ్‌లుగా కొనసాగుతున్న అధికారులను తిరిగి డీఎస్డీఓలుగా మారుస్తూ జీవో విడుదల చేయడం అభినందనీయం. 2018లో ఉన్న అప్పటి ప్రభుత్వం క్రీడల శాఖను స్టెప్‌లో విలీనం చేయడం వల్ల పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. ఇప్పుడు ఆ ఇబ్బందులకు తెర పడినట్లయింది. దీంతో జిల్లాస్థాయిలో క్రీడాభివృద్ధి సాధ్యమవుతుంది.

– శ్రీనివాస్‌కుమార్, చీఫ్ కోచ్, కాకినాడ డీఎస్ఏ

వ్యక్తి ప్రాణం కాపాడిన ట్రాఫిక్ సీఐ


ఆత్మహత్య చేసుకోవాలనుకున్న వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రామకృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ప్రాణాన్ని ట్రాఫిక్ సీఐ రామకృష్ణ కాపాడారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల ప్రకారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజాభద్రత కోసం ప్రతి రోజు విజువల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం 2వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఆ సమయంలో దోభీఘాటు వైపు వెళ్తున్న ఆయన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకునేందుకు రైలు పట్టాలపై పడుకుని ఉండడం గమనించారు. వెంటనే ఆయన అక్కడకు చేరుకుని ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. స్థానిక సింహాచల్‌నగర్‌కు చెందిన పగడాల నానిగా అతనిని గుర్తించారు. తాను కుటుంబ గొడవలు, సమస్యల కారణంగా మనస్థాపం చెంది, ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో రైలు పట్టాలపై పడుకున్నానని నాని సీఐకు తెలిపాడు. అతనికి సీఐ ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి, అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కార్తీక వర్మ మృతదేహం గుర్తింపు

ముమ్మిడివరం: అదృశ్యమైన బీటెక్ విద్యార్థి కార్తీక వర్మ(22) మృతదేహాన్ని వృద్ధ గౌతమి గోదావరిలో పోలీసులు గుర్తించారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంకకు చెందిన కార్తీక వర్మ ఆదివారం తెల్లవారు జామున స్నేహితుడి ఇంటి వద్ద మోటారు బైక్, కాళ్ల చెప్పులు వదలి అదృశ్యమైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య, ఎస్సై ఎస్.శివప్రసాద్ కాడినాడ నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి గాలింపు చర్యలు చేపట్టారు. స్పైడర్ అనే డాగ్ ముందుగా కార్తీక వర్మ చెప్పులను వాసన చూసి అక్కడ నుంచి కర్రివాని రేవు ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన దాటి కొబ్బరి తోటల మీదుగా వృద్ధ గౌతమీ గోదావరి పాయ వరకు వెళ్లి ఆగిపోయింది. ఈ మేరకు పోలీసులు కార్తీక వర్మ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో నాటు పడవలపై గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం కర్రివాని రేవు వద్ద వృద్ధ గౌతమీ గోదావరి పాయలో కార్తీక వర్మ మృతదేహాన్ని గుర్తించారు. ఎస్సై శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీర్థయాత్రకు వచ్చిన ముస్లిం మహిళ అనంత లోకాలకు..

అంబాజీపేట: కార్తిక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఎంతో మహిమ కలిగిన ఏకాదశరుద్రులను దర్శించుకునేందుకు బస్సులో వచ్చిన ఓ మహిళ సోమవారం ఉదయం అదే బస్సు కిందపడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మలకపల్లికి చెందిన ముస్లిం మహిళ షేక్ ఫాతిమా బీబీ (57) కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరిన ఏకాదశ రుద్రుల దర్శిని, ప్రత్యేక బస్సులో ఏకాదశ రుద్రులను దర్శించుకునేందుకు తీర్థయాత్రకు వచ్చారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో వ్యాఘ్రేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు బస్సు దిగిన ఆ మహిళ ప్రమాదవశాత్తూ అదే బస్సు కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- తుపాను షెల్టర్స్, హాస్పిటల్స్‌కు అంతరాయం కలగకూడదు
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ఆదేశం
- ఐదు సర్కిళ్లలో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం: మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కలిగే విద్యుత్ ప్రమాదాలు, అంతరాయాల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయం నుంచి ఎప్పటికప్పుడు టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టేందుకు సంస్థ డైరెక్టర్లు, ఐదు సర్కిళ్ల అధికారులకు అవసరమైన సూచనలను సీఎండీ చేశారు. ప్రమాదాలు, అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912కి తెలియజేయాలన్నారు. తుపాను సహాయక కేంద్రాలకు, హాస్పిటల్స్‌కు తప్పనిసరిగా విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్ల ఎస్ఈలను ఆదేశించారు. తుపాను ప్రభావానికి తెగిపడే విద్యుత్ వైర్లను, విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలను అందుబాటులో ఉంచాలని ఎస్ఈలను ఆదేశించారు. డైరెక్టర్ ఆపరేషన్స్ బి.రమేష్ ప్రసాద్ రాజమహేంద్రవరం సర్కిల్‌లోనూ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఏవీవీ సూర్యప్రతాప్ ఏలూరు సర్కిల్‌లో పునరుద్ధరణ చర్యల ఏర్పాట్లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చే విద్యుత్ అంతరాయాల ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకునేందుకు ఐదు జిల్లాల్లో కంట్రోలు రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సీఎండీ తెలిపారు. సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912, వాట్సాప్ నంబర్ 8500001912, కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు

టోల్ ఫ్రీ నంబర్	:	1912
కార్పొరేట్ కార్యాలయం	:	9440816373
శ్రీకాకుళం	:	9490612633
విజయనగరం	:	9490610102
విశాఖపట్నం	:	7382299975
రాజమహేంద్రవరం	:	7382299960
ఏలూరు	:	9440902926

ఘనంగా సత్యదీక్షల విరమణ

స్వాములతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం


దీక్ష విరమణకు ఇరుముడి ధరించి రత్నగిరికి చేరుకున్న సత్యస్వాములు

అన్నవరం : రత్నగిరి వాసుడు సత్యదేవుని నామం జపిస్తూ దీక్షలు ఆచరించిన వేలాది మంది స్వామివారి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా సోమవారం దీక్ష విరమించారు. ప్రధానాలయంలో స్వామివారికి జన్మ నక్షత్ర పూజల అనంతరం సత్యదేవుని నిత్యకల్యాణ మంటపంలో అర్చక స్వాములకు ఇరుముడులు సమర్పించి, వారి చేతుల మీదుగా దీక్షా మాలలు విసర్జించి, దీక్ష విరమించారు. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. 27 రోజులు దీక్ష చేసిన స్వాములతోబాటు 18 రోజులు, తొమ్మిది రోజులు దీక్ష చేసిన సత్యస్వాములు కూడా ఇరుముడి కట్టుకుని దీక్ష విరమించారు. తెల్లవారు జామున రెండు గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వివిధ ప్రాంతాల నుంచి సత్యదీక్షా స్వాములు ఇరుముడి ధరించి రత్నగిరి కి వస్తూనే ఉన్నారు. దూర ప్రాంతాలకు చెందిన సత్యదీక్ష స్వాములు, ఏజెన్సీ ప్రాంతానికి చెందిన స్వాములు పెద్ద సంఖ్యలో ఆదివారం మధ్యాహ్నానికే రత్నగిరికి చేరుకుని సత్యదేవుని వ్రతాలాచరించి స్వామివారి పడిపూజ లో పాల్గొన్నారు. వీరంతా తెల్లవారుజామునే దీక్షా ఇరుముడి ధరించి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు మూడు వేల మంది రత్నగిరిపై దీక్ష విరమించినట్లు అధికారులు తెలిపారు. వీరిలో గిరిజన ప్రాంతాల నుంచి విచ్చేసిన 500 మంది కూడా ఉన్నారు. కాగా, దేవస్థానం పూర్వపు ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులు ఇరుముడితో గిరి ప్రదక్షిణ చేసిన అనంతరం మెట్లదారిన రత్నగిరి చేరుకుని వనదుర్గ అమ్మవారి ఆలయంలో ఇరుముడి సమర్పించారు. అనంతరం నిత్యకల్యాణ మంటపంలో దీక్ష విరమించారు. సత్యదీక్ష విరమణకు విచ్చేసిన సత్యస్వాములు, వారి కుటుంబ సభ్యులతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. స్వామివారి భక్తులతో బాటు దీక్ష స్వాములకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. అర్చక స్వాములు దత్తాత్రేయ శర్మ, సుధీర్, రామ్‌కుమార్, పవన్, కొండవీటి రాజా ఇరుముడి స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రత్నగిరి అభివృద్ధికి కొత్త మాస్టర్‌ప్లాన్

నేడు దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సమావేశం


అన్నవరం దేవస్థానం కొత్త మాస్టర్ ప్లాన్

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివిధ నిర్మాణ పథకాలకు సంబంధించి 2010లో రూపొందించిన 'మాస్టర్ ప్లాన్'లో కొన్ని మార్పులు చేసి కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించారు. గత నెల మూడో తేదీన రత్నగిరిపై దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో రత్నగిరి నూతన మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించారు. విజయవాడలోని దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం జరిగే సమావేశంలో కొత్త మాస్టర్ ప్లాన్‌పై చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ఈఓ రామచంద్రమోహన్ సమావేశంలో పాల్గొంటారు. కమిషనర్ ఈ నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసే ముందు రివైజ్డ్ మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.

పాత మాస్టర్ ప్లాన్ ఇలా..

ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా సత్రాల నిర్మాణాలు చేపట్టాలని, అవన్నీ సత్యగిరి మీద చేపట్టాలని పేర్కొన్నారు. భక్తుల సంఖ్యను బట్టి టాయిలెట్‌లు నిర్మించాలని పేర్కొన్నారు. ఘాట్‌రోడ్‌లు వెడల్పు చేయాలని పేర్కొన్నారు. కొత్తగా క్యూ లైన్లు నిర్మించాలని పేర్కొన్నారు.

కొత్తగా మాస్టర్ ప్లాన్ చేర్పుతున్న అంశాలు

- నాలుగు మాడ వీధులు ఉండాలని మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు.
- భక్తులు ఏటా 40 శాతం పెరుగుతున్నారు. కరోనా తరువాత వ్యక్తిగత వాహనాలపై వచ్చే భక్తులు ఎక్కువగా ఉన్నారు. ఆ వాహనాల నిలుపుదలకు మల్టీలెవల్ పార్కింగ్, వాహనాలు కొండ దిగువకు వెళ్లేందుకు రోడ్లు నిర్మాణం చేపట్టాలి.
- అన్నదానం నుంచి, వివిధ సత్రాల నుంచి వచ్చే వ్యర్థాలు, టాయిలెట్స్ నుంచి వచ్చే వేస్ట్ కు సూయెజ్ ట్రీట్మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌లు కూడా ఇందులో చేర్చారు.
- దేవస్థానంలో వివిధ చోట్ల, ఘాట్‌రోడ్లలో విద్యుత్ దీపాల ఏర్పాటు, అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటు
- మారేడు, తులసి వనాలు, మామిడి, అరటి తదితర చెట్లు, పూలతోటలు విరివిగా పెంచాలి.
- వసతి గదులు దొరకని భక్తులకు పలు చోట్ల విశ్రాంతి షెడ్ల నిర్మాణం ఆవశ్యకత, కొండదిగువన భక్తుల కోసం చేపట్టాల్సిన నిర్మాణాలు
- జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం కూడా ఇందులో చేర్చారు.

రూ. 90 లక్షల విలువ చేసే విదేశీ సిగరెట్లు పట్టివేత


కస్టమ్స్ అధికారులు స్వాధీన పర్చుకున్న విదేశీ సిగరెట్లు

రాజానగరం: కస్టమ్స్ సుంకాలు చెల్లించకుండా అక్రమంగా తరలిస్తున్న విదేశీ బ్రాండ్స్‌కి చెందిన 18 లక్షల సిగరెట్లను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు రాజానగరంలో జాతీయ రహదారిపై కస్టమ్స్ అధికారులకు సోమవారం తనిఖీలు చేస్తుండగా రెండు వాహనాలలో తరలిస్తున్న ఈ సరకు దొరికింది. ఒక వాహనంలో బ్యాగ్లో విమల్ గోల్డ్ బ్రాండ్ సిగరెట్లు, రెండో వాహనంలో పారిస్ బ్రాండ్ సిగరెట్లు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.90 లక్షలు ఉంటుందని అంచనా. బిహార్‌లోని పాట్నా నుంచి తరలిస్తున్నట్టుగా గుర్తించారు. నిందితులు పరారు కాగా రెండు వాహనాలతో సహా సరకుని స్వాధీనపర్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

- కాకినాడ శ్రీపీఠంలో మారేడుదళాలతో పూజ
- వర్షాన్ని లెక్కచేయక తరలివచ్చిన మహిళలు


కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం వేదికపై శివపార్వతులకు మారేడు దళాలతో పత్రి పూజ చేస్తున్న పరిపూర్ణానంద స్వామి


లలితా కుంకుమార్చనకు హాజరైన మహిళలు

కాకినాడ రూరల్: మహాశక్తి యాగం కార్యక్రమంలో భాగంగా కాకినాడ రమణయ్యపేట శ్రీపీఠంలో సోమవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. లలితా కుంకుమార్చనలు, వేదికపై పంచలోహ దివ్యమూర్తులైన శివపార్వతులకు కల్యాణం, మారేడుదళాలతో పత్రి పూజను పరిపూర్ణానంద స్వామిజీ నిర్వహించారు. తుపాను ప్రభావంతో తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నా, లెక్కచేయని మహిళలు శత కోటి లలితా కుంకుమార్చన యాగంలో పాల్గొన్నారు. 21వ రోజున భక్తులనుద్దేశించి పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ లలితా సహస్ర నామాలు చాలా విశిష్టమైనవని, అమ్మవారిని పూజిస్తే అన్నీ ప్రసాదిస్తుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో మృతిపై కేసు నమోదు

రాయవరం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్సై జి.నరేష్ విలేకరులకు తెలిపారు. రాయవరం గ్రామానికి చెందిన రండి రాంబాబు(50) ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పదేళ్లుగా భార్యకు దూరంగా ఉంటున్న రాంబాబు మద్యానికి బానిసై, చెడు వ్యసనాలకు లోనయ్యాడు. ఈ నేపథ్యంలో మానసిక వేదనతో విషాన్ని తాగడంతో మృతి చెందాడని ఎస్సై నరేష్ తెలిపారు. రాంబాబు కుమారుడు వీరదివాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి మృతి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ముమ్మిడివరం: మండల పరిధిలోని అన్నంపల్లి పంచాయతీలో విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. సోమవారం గ్రామంలోని చిట్టిమేని వీర్రాఘవులుకు చెందిన గేదె నీళ్ల కోసం వెళ్లే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతి చెందడం చూసి రైతు వీర్రాఘవులు బోరున విలపించాడు.


అన్నంపల్లిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె